అమ్మకానికి నాకౌట్ టికెట్లు

న్యూఢిల్లీ : ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లకు సంబంధించి చివరి దశ టికెట్ల అమ్మకం ఆన్‌లైన్‌లో గురువారం రాత్రి నుంచి ఆరంభించనున్నట్టు బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. టికెట్.క్రికెట్‌వరల్డ్‌కప్.కామ్ వెబ్‌సైట్ ద్వారా సెమీఫైనల్స్, ఫైనల్స్‌కు సంబంధించి మిగిలిన టికెట్లను ఆన్‌లైన్‌లో అమ్మనున్నారు. భారత్‌తోపాటు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు ఇప్పటికే సెమీస్‌కు అర్హత సాధించాయి. నాలుగో సెమీస్ స్థానం కోసం న్యూజిలాండ్, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ పోటీపడుతున్నాయి. కాగా తొలి సెమీఫైనల్ నవంబర్ 15న రెండో సెమీఫైనల్ నవంబర్ 16న, ఫైనల్ నవంబర్ 19న జరుగనున్నాయి.

బజరంగ్‌కు బెయిల్

న్యూఢిల్లీ : పరువునష్టం దావా కేసులో రెజ్లర్ బజరంగ్ పునియాకు ఢిల్లీ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో బజరంగ్ తన పేరును ప్రస్తావించి పరువు నష్టం కలిగించాడని కోచ్ నరేశ్ దహియా కోర్టును ఆశ్రయించాడు. దీనిపై కోర్టు బజరంగ్‌కు సమన్లు జారీచేసింది. తనకు కోర్టులో హాజరునుంచి మినహాయింపు ఇవ్వాలని బజరంగ్ చేసిన అభ్యర్థన మేరకు కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. తదుపరి విచారణ మార్చి 5న జరుగుతుందని దహియా న్యాయవాది తెలిపారు.

దక్షిణాఫ్రికా X అఫ్ఘానిస్థాన్

అహ్మదాబాద్: వన్డే ప్రపంచకప్‌లో అంచనాలను మించి రాణిస్తున్న అఫ్ఘానిస్థాన్.. శుక్రవారం తమ చివరి లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో అమీతుమీకి సిద్ధమైంది. సెమీస్ రేసులో నిలువాలంటే కచ్చితంగా విజయం సాధించడంతో పాటు.. ప్రత్యర్థిని భారీ తేడాతో ఓడించాల్సిన అనివార్య పరిస్థితుల్లో అఫ్ఘాన్ మైదానంలో అడుగుపెట్టనుంది. గత మ్యాచ్‌లో ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియాను ఓడించినంత పనిచేసిన అఫ్ఘాన్‌ను తక్కువ అంచనా వేయడానికి లేకపోవడంతో.. దక్షిణాఫ్రికా పూర్తి స్థాయి బలగంతో విజృంభించాలని చూస్తున్నది.

కివీస్‌తో ఖాయమే!

భారత్ సెమీస్ ప్రత్యర్థి న్యూజిలాండ్?

బౌల్ట్ (3/37)

వరుస పరాజయాలకు స్వస్తి పలుకుతూ.. కీలక దశలో న్యూజిలాండ్ కలిసికట్టుగా కదంతొక్కింది. సెమీస్ రేసులో నిలువాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో శ్రీలంకను తుక్కు కింద కొట్టింది. గత మ్యాచ్‌లో నాలుగొందలకు పైగా స్కోరు చేసినా పరాజయం పాలైన కివీస్ ఈసారి భారీ విజయం ఖాతాలో వేసుకొని రన్‌రేట్ మెరుగుపరుచుకుంది. ఇక అద్భుతాలు జరిగితే తప్ప సెమీస్‌లో టీమ్ఇండియాతో న్యూజిలాండ్ తలపడటం ఖాయమే!

లంకపై ఘనవిజయం ● మెరిసిన బౌల్ట్, కాన్వే, రచిన్

బెంగళూరు: న్యూజిలాండ్ ఊపిరి పీల్చుకుంది. వరుస ఓటములతో సతమతమవుతున్న ఆ జట్టు ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్‌లో వరుసగా నాలుగు పరాజయాల తర్వాత విలియమ్సన్ సేన విజయం సాధించింది. గురువారం జరిగిన పోరులో న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చేసి నాకౌట్ బెర్త్‌కు మరింత చేరువైంది. మెగాటోర్నీలో ఆడిన తొలి నాలుగు మ్యాచ్‌ల్లో విజయాలు సాధించిన న్యూజిలాండ్.. ఆ తర్వాత వరుసగా నాలుగింట ఓడి.. చివరి లీగ్ మ్యాచ్‌లో విజయంతో సెమీస్ రేసులో నిలిచింది. లీగ్ దశలో 9 మ్యాచ్‌లు ఆడిన కివీస్ 10 పాయింట్లతో ప్రస్తుతం పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది. పాకిస్థాన్ (+0.036), అఫ్ఘనిస్థాన్ (−0.338)కు అధికారికంగా అవకాశం ఉన్నా.. రన్‌రేట్‌లో న్యూజిలాండ్ (+0.743) చాలా మెరుగ్గా ఉంది. దీంతో తమ చివరి మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికాపై అఫ్ఘానిస్థాన్, ఇంగ్లండ్‌పై పాకిస్థాన్ అసాధారణ ప్రదర్శన చేస్తే తప్ప కివీస్‌ను దాటి ముందంజ వేయడం కష్టమే. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 46.4 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. కుశాల్ పెరెరా (28 బంతుల్లో 51; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) ఈ వరల్డ్‌కప్‌లోనే వేగవంతమైన అర్ధశతకంతో రికార్డు సృష్టిస్తే మిగిలినవాళ్లు ఘోరంగా విఫలమయ్యారు. చివర్లో తీక్షణ (91 బంతుల్లో 38 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ కుశాల్ మెండిస్ (6), నిషాంక (2), సమరవిక్రమ (1), అసలంక (8) మాథ్యూస్ (16), ధనంజయ డిసిల్వ (19), కరుణరత్నె (6) ప్రభావం చూపలేకపోయారు. కివీస్ బౌలర్లలో బౌల్ట్ 3, ఫెర్గూసన్, శాంట్నర్, రచిన్ రవీంద్ర తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ 23.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. కాన్వే (45; 9 ఫోర్లు), రచిన్ రవీంద్ర (42), డారిల్ మిషెల్ (43; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. లంక బౌలర్లలో మాథ్యూస్ రెండు వికెట్లు పడగొట్టాడు. మొత్తంగా తొమ్మిది మ్యాచ్‌లాడిన లంక రెండు విజయాలతో ఇంటిబాట పట్టింది. బౌల్ట్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 46.4 ఓవర్లలో 171 ఆలౌట్ (కుశాల్ పెరెరా 51; తీక్షణ 38 నాటౌట్; బౌల్ట్ 3/37, రచిన్ 2/21), **న్యూజిలాండ్:** 23.2 ఓవర్లలో 172/5 (కాన్వే 45, డారిల్ 43; మాథ్యూస్ 2/29).

భారత్ సెమీస్ పోరు కివీస్‌తోనే!

వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో మూడు సెమీస్ బెర్త్‌లు ఖాయం అయిపోగా.. న్యూజిలాండ్ నాలుగో స్థానంలో నిలువడం ఖాయంగా కనిపిస్తున్నది. పాకిస్థాన్ (+0.036), అఫ్ఘానిస్థాన్ (−0.338)అధికారికంగా పోటీలో ఉన్నా.. ఆ జట్ల రన్‌రేట్‌లు మరీ తక్కువగా ఉండటంతో తమ చివరి మ్యాచ్‌ల్లో నెగ్గిన న్యూజిలాండ్ (+0.743)ను దాటేయడం కష్టమే! నాకౌట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న పాకిస్థాన్.. చివరి బెర్త్ దక్కించుకోవాలంటే.. ఇంగ్లండ్‌పై భారీ విజయం సాధించాల్సి ఉంటుంది. మొదట బ్యాటింగ్ చేస్తే మాత్రమే పాక్‌కు అవకాశం ఉంది. అందులోనూ ఇంగ్లిష్ టీమ్‌ను 275 పరుగుల కంటే ఎక్కువ తేడాతో ఓడిస్తేనే రన్‌రేట్‌లో కివీస్‌ను దాటి నాలుగో స్థానానికి చేరుకోనుంది. ఇక అఫ్ఘాన్‌కు ఎలా చూసిన సెమీస్ దారులు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో టేబుల్ టాపర్‌గా ఉన్న టీమ్ఇండియా.. నాలుగో స్థానంలో ఉన్న న్యూజిలాండ్‌తో సెమీఫైనల్లో అమీతుమీ తేల్చుకోనుండటం ఖాయమే! 2019 ప్రపంచ కప్‌లోనూ న్యూజిలాండ్‌తోనే భారత్ తలపడగా.. వర్షం అంతరాయం మధ్య సాగిన ఆ పోరులో టీమ్ఇండియా పరాజయం పాలై రిక్త హస్తాలతో వెనుదిరిగిన విషయం తెలిసిందే!

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
భారత్ ✓	8	8	0	+2.45	16
దక్షిణాఫ్రికా ✓	8	6	2	+1.37	12
ఆస్ట్రేలియా ✓	8	6	2	+0.86	12
న్యూజిలాండ్	9	5	4	+0.74	10
పాకిస్థాన్	8	4	4	+0.03	8
అఫ్ఘానిస్థాన్	8	4	3	−0.33	8
ఇంగ్లండ్ X	8	2	6	−0.88	4
బంగ్లాదేశ్ X	8	2	6	−1.14	4
శ్రీలంక X	9	2	7	−1.41	4
నెదర్లాండ్స్ X	8	2	6	−1.63	4

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

1 పాతికేండ్ల లోపు ఒక ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు (565) చేసిన ప్లేయర్‌గా న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర (23 ఏండ్లు) రికార్డుల్లోకెక్కాడు. 1996 వరల్డ్ కప్‌లో 523 పరుగులు చేసిన సచిన్‌ను రచిన్ అధిగమించాడు.

1 ఈ ప్రపంచకప్‌లో వేగవంతమైన అర్ధశతకం (22 బంతుల్లో) చేసిన ప్లేయర్‌గా కుశాల్ పెరెరా నిలిచాడు.

జాతీయ చెస్ చాంప్ సంహిత

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జాతీయ అండర్-9 బాలికల చెస్ చాంపియన్‌షిప్‌లో రాష్ర్టానికి చెందిన సంహిత పుంగవనం విజేతగా నిలిచింది. జార్ఖండ్ వేదికగా జరిగిన టోర్నీలో సంహిత మొత్తం 11 రౌండ్లలో పది పాయింట్లు సొంతం చేసుకుంది. ఆఖరిదైన పదకొండో రౌండ్‌లో తమిళనాడుకు చెందిన టాప్‌సీడ్ ప్లేయర్ శ్రావణికపై అద్భుత విజయం సాధించింది. నల్లపావులతో బరిలోకి దిగిన సంహిత 35 ఎత్తుల్లో ప్రత్యర్థిని చిత్తు చేసింది. గురువారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో సంహితను రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ సన్మానించారు.

భారత ఆర్చర్ల జోరు

● ఏషియన్ ఆర్చరీ చాంపియన్‌షిప్

బ్యాంకాక్: ఏషియన్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత ఆర్చర్ల పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. గురువారం జరిగిన వేర్వేరు విభాగాల్లో మన ఆర్చర్లు మూడు స్వర్ణాలు, రజతం, మూడు కాంస్య పతకాలు దక్కించుకున్నారు. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో తెలుగు స్టార్ ఆర్చర్ వెన్నెం జ్యోతిసురేఖ రజత పతకం సొంతం చేసుకుంది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన పోరులో సురేఖ 8–9(టై బ్రేక్)తేడాతో పర్నీత్‌కౌర్ చేతిలో ఓటమిపాలైంది. అంతకు ముందు సురేఖ, పర్నీత్ మధ్య సాగిన పోరు 145–145తో సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు టైబ్రేక్ తప్పనిసరైంది. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో భారత ద్వయం అదితి స్వామి, ప్రియాంశ్ 156–151తో థాయ్‌లాండ్ జోడీపై గెలిచి పసిడి సొంతం చేసుకుంది. జ్యోతి, పర్నీత్, అదితితో కూడిన భారత త్రయం పసడి కైవసం చేసుకోగా, అభిషేక్ వర్మ కాంస్యం దక్కించుకున్నాడు.

క్రికెట్‌కు లానింగ్ వీడ్కోలు



మెల్‌బోర్న్: అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు ఆస్ట్రేలియా దిగ్గజం మెగ్ లానింగ్ వీడ్కోలు పలికింది. తన 13 ఏండ్ల కెరీర్ నుంచి రిటైర్మెంట్ తీసుకుంటున్నట్లు లానింగ్ గురువారం ప్రకటించింది. సుదీర్ఘ కెరీర్‌లో ఆసీస్ తరఫున ఆరు టెస్టులు, 103 వన్డేలు, 132 టీ20లు ఆడిన లానింగ్ అన్ని ఫార్మాట్లలో కలిపి 8352 పరుగులు చేసింది. ఇందులో ఏడు ప్రపంచకప్ టైటిళ్లు ఉండటం విశేషం. అయితే అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికిన లానింగ్..ప్రపంచ వ్యాప్తంగా వివిధ టీ20 లీగ్‌లలో కొనసాగుతానని పేర్కొంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలుగాలన్న నిర్ణయం కఠినమైందే. కానీ ఇదే సరైన సమయంగా భావించాను. సుదీర్ఘంగా 13 ఏండ్ల పాటు ఆసీస్ జట్టుకు సేవలందించాను. కెరీర్‌లో సాధించిన విజయాల పట్ల గర్వంగా ఉన్నాను' అని అంది. లానింగ్ గైర్హాజరీలో త్వరలో భారత పర్యటనకు రానున్న ఆసీస్ జట్టు అలీస్సా హీలీ సారథ్యంలో బరిలోకి దిగనుంది. ఆస్ట్రేలియా అందించిన అత్యుత్తమ క్రికెటర్లలో లానింగ్ ఒకరని క్రికెట్ ఆస్ట్రేలియా సీఈవో నిక్ హాక్లే తెలిపాడు.

ఫింగర్ ప్రింట్ బ్యూరో సిబ్బందిని అభినందిస్తున్న డీజీపీ, ఏడీజీ

ఫింగర్ ప్రింట్ బ్యూరోకు జాతీయ గుర్తింపు

- స్మార్ట్ ఇన్వెస్టిగేషన్‌లో సెకండ్
- 24వ అఖిల భారత ఎఫ్‌పీబీ కాన్ఫరెన్స్‌లో అవార్డు ప్రదానం
- డీజీపీ అంజనీకుమార్, ఏడీజీ మహేశ్‌భాగవత్ అభినందనలు

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర సీఐడీ విభాగంలో ఫింగర్ ప్రింట్ బ్యూరోకు జాతీయస్థాయిలో మరోసారి గుర్తింపు దక్కింది. సాంకేతికతను ఉపయోగించి చాలెంజింగ్ కేసులను సులువుగా పరిష్కరిస్తుండటం పట్ల నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) అధికారులు ఈ అవార్డును అందజేశారు. అన్ని రాష్ర్టాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఫింగర్ ప్రింట్స్ బ్యూరో (ఎఫ్‌పీబీ) డైరెక్టర్ల 24వ అఖిల భారత కాన్ఫరెన్స్ ఈ నెల 6, 7న న్యూఢిల్లీలో నిర్వహించగా, ఇందులో రాష్ర్టానికి అవార్డు ఇవ్వాలని నిర్ణయం తీసుకొన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అజయ్ తండాలో 2020లో ప్రసాదంలో మత్తుమందు పెట్టి దంపతులను హతమార్చి, నగదు, ఆభరణాలు దొంగిలించిన కేసును ఖమ్మం ఫింగర్ ప్రింట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ (ఎక్స్‌పర్ట్) బీ నరేశ్ సులువుగా ఛేదించారు. అప్పటికే స్థానికంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో ఇన్‌స్పెక్టర్ నరేశ్ సంఘటనా స్థలానికి చేరుకొని, ప్రాథమికంగా వేలిముద్రలు, ఫోరెన్సిక్ ఎవిడెన్స్, యోగిందర్ అనే వ్యక్తి అరెస్టుకు ఆధారాలు సేకరించారు. ఈ కేసులో ఆధారాలు పరిశీలించిన న్యాయస్థానం అతడికి ఏడేండ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధించింది. తెలంగాణ సీఐడీ అధికారుల పనితీరుకు ఎన్సీఆర్బీ అధికారులు జాతీయ స్థాయిలో గుర్తించి అవార్డు అందించారు. తెలంగాణ రాష్ట్రం స్మార్ట్ ఇన్వెస్టిగేషన్‌లో ద్వితీయస్థానం దక్కిందని కొనియాడారు. ఈ సందర్భంగా ఫింగర్ ప్రింట్స్ బ్యూరో డైరెక్టర్ తాతారావు, సిబ్బందిని గురువారం తన కార్యాలయంలో డీజీపీ అంజనీకుమార్, మహేశ్ భాగవత్ అభినందించి, మెమెంటో అందించారు. కేసుల పరిష్కారంలో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు.

ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డికి ఐఎస్‌వో 21001 గుర్తింపు పత్రాన్ని అందజేస్తున్న ఐఎస్‌వో సంస్థ ప్రతినిధి శివయ్య

ఉస్మానియా మెడికల్ కాలేజీకి గౌరవం

- ఐఎస్‌వో 21001 సర్టిఫికెట్ ప్రదానం

సుల్తాన్‌బజార్,నవంబర్ 9. ఉస్మానియా మెడికల్ కళాశాల ఐఎస్‌వో 21001 గుర్తింపు దక్కింది. ఈ మేరకు శుక్రవారం కోఠిలోని ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డికి ఐఎస్‌వో సంస్థ ప్రతినిధి శివయ్య ఐఎస్‌వో 21001 గుర్తింపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ర్టాల్లో ఏ వైద్య కళాశాలకు దక్కని గుర్తింపు మొదటిసారి ఉస్మానియా మెడికల్ కళాశాలకు లభించడం గర్వకారణమని అన్నారు. కళాశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్యా ప్రమాణాలు, భద్రత, సామర్థ్యం, కళాశాలలోని గ్రీన్ ఎన్విరాన్‌మెంట్, అధ్యాపకుల విద్యా బోధన, ఉద్యోగుల సమిష్టి కృషితోనే ఈ గుర్తింపు లభించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ జయ, ఫిజియాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పద్మిని, ప్రొఫెసర్లు పద్మావతి, అనిత, ఎంపీహెచ్‌ఈవో వేణుగోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బుల్డోజర్లతో బీజేపీ అభ్యర్థి బెదిరింపు

- ఉత్తరప్రదేశ్ దాడులను గుర్తుచేస్తున్న నందీశ్వర్‌గౌడ్
- ఇండ్లు కూల్చేస్తానని హెచ్చరికలు
- పటాన్‌చెరులో వివాదాస్పదంగా కాషాయ పార్టీ ప్రచారం

పటాన్‌చెరు, నవంబర్ 9: తెలంగాణ వ్యాప్తంగా గురువారం వివిధ పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు.. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నడుమ ర్యాలీగా వెళ్లి నామినేషన్లు వేస్తే.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్ మాత్రం జేసీబీలు, బుల్డోజర్లతో వివాదాస్పదంగా ర్యాలీ నిర్వహించి నామినేషన్ వేశారు. అంతేకాదు.. యూపీలో నిందితుల నేరారోపణలు కోర్టుల్లో రుజువుకాకముందే.. అక్కడి బీజేపీ ప్రభుత్వం నేరస్థుల ఇండ్లను బుల్డోజర్లతో కూల్చిన సంఘటనను ఈ ర్యాలీ గుర్తుచేసిందని స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే.. యూపీ తరహా దాడులు చేస్తామని హెచ్చరించినట్టుగా ఉందని వాపోయారు. ఎన్నికలు రాకముందే బీజేపీ నాయకుల తీరు ఇలా ఉంటే.. ఎన్నికల్లో గెలిస్తే వారి ఆగడాలు ఏ స్థాయిలో ఉంటాయోనని చర్చించుకుంటున్నారు. యూపీ తరహా బుల్డోజర్‌ల సంస్కృతిని పటాన్‌చెరులో పరిచయం చేసేందుకు నందీశ్వర్‌గౌడ్ ప్రయత్నిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రశాంతమైన, ఆదర్శవంతమైన పటాన్‌చెరులో 'బుల్డోజర్లతో కూల్చివేతలు' అంటూ మాజీ ఎమ్మెల్యే చేస్తున్న సందడిపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి.

పటాన్‌చెరులో బీజేపీ అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్ నామినేషన్‌కు తీసుకొచ్చిన బుల్డోజర్లు, జేసీబీలు

సీఎం సీఎం అని ఉన్నది పోగొట్టిర్రు

● ఎంపీ బండి సంజయ్ ఆక్రోశం

కడెం, నవంబర్ 9: ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం ఆ పార్టీ ఎంపీ బండి సంజయ్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సమయంలో కార్యకర్తలందరూ సీఎం.. సీఎం అంటూ నినాదాలు చేయడంతో వారిపై సంజయ్ ఫైర్ అయ్యారు. ఇది వరకు సీఎం.. సీఎం అంటూ ప్రచారం చేసి.. తన రాష్ట్ర అధ్యక్షుడి పదవి ఊడగొట్టారని ఆక్రోశం వెళ్లగక్కారు. ఇక కాంగ్రెస్‌లో సీఎం పదవి కోసం పది మంది పోటీ పడుతున్నారని, ఎవరు సీఎం అనేది ఇప్పటికీ తేలలేదని చెప్పారు. ఆ పరిస్థితి బీజేపీకి వచ్చేలా కార్యకర్తలు వ్యవహరించవద్దని సూచించారు. దీంతో సభకు వచ్చిన కార్యకర్తలందరూ మౌనంగా ఉండిపోయారు.

పొంగులేటి పంపకాలపై ఐటీ నజర్

- ఖమ్మం, హైదరాబాద్‌లోని 29 ప్రాంతాల్లో సోదాలు
- 200 మంది ఆఫీసర్లతో తనిఖీలు
- కాంగ్రెస్ నేతల ఫిర్యాదుతోనే ఐటీ అధికారుల సోదాలు!
- కోవర్టుల లీక్‌తో ముందే 'సర్దేసిన' పొంగులేటి
- రేవంత్ డబ్బు పొంగులేటి ద్వారా పంపకం!

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బులు పంచి గెలువాలనుకుంటున్న కాంగ్రెస్ నేతలపై ఆదాయం పన్ను (ఐటీ) అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ పుంజుకుంటున్న వేళ.. అక్కడ కాంగ్రెస్ పార్టీకి చెందిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన ఆర్థికబలం నిరూపించుకునేందుకు డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలే ఐటీ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజాము నుంచి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సికింద్రాబాద్, లాంకోహిల్స్, రాయదుర్గం, బషీర్‌బాగ్ ప్రాంతాలతోపాటు ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్, పాలేరు, స్వగ్రామం కల్లూరులోని నారాయణపురంలో పొంగులేటికి చెందిన కంపెనీలు, బంధువుల ఇండ్లలో ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. పలు కీలక పత్రాలు, హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. హైదరాబాద్‌లో 8 చోట్ల, ఖమ్మంలోని 21 ప్రదేశాల్లో అధికారులు సోదాలు చేపట్టారు. బెంగళూరు, చెన్నైకి చెందిన మొత్తం 200 మందికిపైగా అధికారులు ఈ సోదాల్లో పాల్గొన్నట్టు తెలిసింది.

హైదరాబాద్‌లోని పొంగులేటి ఆఫీసులో సోదాలకు వచ్చిన అధికారుల వాహనాలు

పంచేది ఆ వసూళ్ల డబ్బులేనా?

ఖమ్మం జిల్లాలోని ఏ ఒక్క బీఆర్‌ఎస్ అభ్యర్థిని అసెంబ్లీ గేటు కూడా ముట్టుకోనివ్వని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మొదటి నుంచి బీరాలు పలుకుతున్నారు. తన డబ్బుతోపాటు టికెట్లు అమ్ముకొని పీసీసీ అధ్యక్షుడు అక్రమంగా సంపాదించిన డబ్బును కూడా ఉమ్మడి ఖమ్మంలో భారీగా పంచుతున్నట్టు కాంగ్రెస్ పార్టీకి చెందిన బహిష్కృత నేతలు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ వైపు గాలి వీస్తుండటంతో డబ్బులు పంచి గెలువాలని కాంగ్రెస్ నేతలు చూస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ఖమ్మం చేరుకున్న డబ్బులో పీసీసీ అధ్యక్షుడి సోదరుల పాత్ర ఉన్నట్టు టికెట్లు ఆశించి భంగపడిన బహిష్కృత నేతలు ఆరోపిస్తున్నారు. ఐటీ సిబ్బందిలోని కొందరు కోవర్టుల ద్వారా సోదాల విషయాన్ని ముందుగానే తెలుసుకున్న పొంగులేటి.. అప్రమత్తమైనట్టు తెలిసింది. అక్రమంగా సంపాదించిన డబ్బు తనిఖీల్లో పట్టుబడకుండా ముందే సర్దేసినట్టు తెలుస్తున్నది. అక్రమ డబ్బునంతా తరలించిన తర్వాత.. తనపై ఐటీ, ఈడీ సోదాలు జరుగుతాయని సభల్లో చెప్పాడని, అతను చెప్పిన 17 గంటల్లోపే ఐటీ సోదాలు జరిగాయని, ఇదంతా ఆయన స్క్రిప్ట్ ప్రకారమే జరిగిందని ఖమ్మానికి చెందిన కొందరు నేతలు చెప్తున్నారు.

మీడియాతో మాట్లాడుతున్న మేఘారెడ్డి బాధితుడు ఒగ్గు పర్వతాలు భార్య

వనపర్తి కాంగ్రెస్ అభ్యర్థి మోసగాడు

- 3.55 కోట్లు ఎగ్గొట్టిన మేఘారెడ్డి
- పోలీసులు చర్యలు తీసుకోలే
- నాడబ్బులివ్వకుంటే ఆత్మహత్యే గతి
- బాధితుడు ఒగ్గు పర్వతాలు

రవీంద్రభారతి, నవంబర్ 9: వనపర్తి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మేఘారెడ్డి తనకు ఇవ్వాల్సిన రూ.3.55 కోట్ల కాంట్రాక్ట్ డబ్బు ఇవ్వకుండా మోసం చేశాడని నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరుకు చెందిన సివిల్ కాంట్రాక్టర్ ఒగ్గు పర్వతాలు ఆరోపించారు. డబ్బులు ఇవ్వకుంటే మేఘారెడ్డి ఇంటి ఎదుట ఆత్మహత్య చేసుకుంటానని ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఒగ్గు పర్వతాలు దంపతులు, బీసీ సంక్షేమ సంఘం నేత నీలా వెంకటేశ్, రాజ్‌కుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ.. మేఘారెడ్డి తనకు ఛత్తీస్‌గఢ్‌లో రైల్వే కాంట్రాక్టు వచ్చిందని, అక్కడ సబ్ కాంట్రాక్ట్ ఇప్పిస్తానని నమ్మించాడని తెలిపారు. హైదరాబాద్ కొత్తపేటలోని గ్రీన్‌హిల్స్ కాలనీలోని ఇంటికి పిలుపించుకొని తనకు సహకరిస్తే భవిష్యత్తులో మంచి కాంట్రాక్ట్‌లు ఇప్పిస్తానని, అవసరమైతే ఎస్క్రో అకౌంట్ ఇప్పిస్తానని నమ్మించాడని చెప్పారు. 2017 జనవరిలో ఛత్తీస్‌గఢ్‌లో పనులు ప్రారంభించానని, ఫిబ్రవరి 6న వనపర్తి గ్రీన్‌పార్కు హోటల్‌లో వర్క్ ఆర్డర్ కాపీ ఇవ్వడంతో 20 రోజు లు అక్కడే ఉండి పనిచేయించానని చెప్పారు. తీరా బిల్లులు అడిగితే సదరన్ కంపెనీ వాళ్లు డబ్బు ఇవ్వలేదన్నాడని, కంపెనీలో ఆరా తీయగా ఆ డబ్బులు ఇచ్చినట్టు తెలిసిందని, దీంతో మేఘారెడ్డి డబ్బులు అడిగితే బెదిరింపులకు పాల్పడ్డారని బాధితుడు కన్నీటిపర్యంతమయ్యారు. మేఘారెడ్డి కుటుంబంతో తనకు ప్రాణహాని ఉన్నదని వనపర్తి స్టేషన్‌లో కేసు పెట్టినట్టు తెలిపారు. డబ్బు ఇవ్వకపోతే తన కుటుంబానికి ఆత్మహత్యే శరణ్యమని వాపోయాడు. సీఎం కేసీఆర్ జోక్యం చేసుకొని డబ్బు ఇప్పించాలని కోరారు.

మేఘారెడ్డి, రేవంత్‌దే బాధ్యత

ఒగ్గు పర్వతాలుకు చెల్లించాల్సిన 3.55 కోట్లు వెంటనే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నేత నీలా వెంకటేశ్ కోరారు. పర్వతాలు కుటుంబం ఏదైనా అఘాయిత్యానికి పాల్పడితే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మేఘారెడ్డిలే బాధ్యత వహించాలని అన్నారు. మేఘారెడ్డి తక్షణమే పర్వతాలుకు డబ్బులు ఇవ్వాలని, లేకుంటే రాష్ట్ర ఎలక్షన్ కమిషన్, డీజీపీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కాంట్రాక్ట్ డబ్బు ఇవ్వకుండా వేధిస్తున్న మేఘారెడ్డికి వెంటనే కాంగ్రెస్ టికెట్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.